ఉచిత వైద్య శిబిరం



నిజాంపేట్: బాచుపల్లి సాయి అనురాగ్ కాలనీలో సాయి అనురాగ్ కాలనీ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమానికి కాలనీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాశిపురం రామాగౌడ్ హాజరయ్యారు. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సాయి అనురాగ్ సేవా సమితి అధ్యక్షులు ఎండీ షబ్బీర్ అహ్మద్, రామకృష్ణ, ఉపాధ్యక్షులు రాజకుమార్, శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్, వేణు, దుర్గ శ్రీనివాస్, హరి, అజయ్‌కుమార్, సుభాని, జితేందర్‌రెడ్డి, పూజారి రాజు, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుభాష్‌నగర్: ఫీడర్ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని గాజులరామారం సబ్‌స్టేషన్ ఏఈ చైతన్య భార్గవ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ కైలాస్‌హిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు షిర్డీహిల్స్, కైలాస్‌హిల్స్, నందినిహిల్స్, తిరుమల హిల్స్, ప్రాగా టూల్స్ కాలనీ, ఐశ్వర్య ఎస్టేట్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

చింతల్‌లో...

చింతల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు బోయిన్‌పల్లి ఏడీ శ్రీకాంత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చింతల్, హెచ్ఎంటీ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్యాస్, శ్రీసాయి కాలనీ ఫీడర్ల పరిధిలో చింతల్, భగత్ సింగ్‌నగర్, చంద్రనగర్, రంగనగర్, శ్రీసాయి కాలనీ, దుర్గయ్య నగర్ తదితర ప్రాంతాలు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు హెచ్ఐఎల్, ప్రాగాటూల్స్ సబ్ స్టేషన్‌ల పరిధిలో సౌభాగ్య నగర్, ఇండో స్వింగ్ ఫీడర్ పరిధిలో ఇందిరా గాంధీనగర్, ఆదర్శ్ నగర్, సౌభాగ్యనగర్, సుమిత్ర నగర్, గుడెన్‌మెట్ తదితర ప్రాంతాలను చెట్ల కొమ్మలు తొలగింపు, ఏబీ స్విచ్‌ల మరమతుల కారణంగా వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు వైఎస్సార్ జయంతి వేడుకలు

సుభాష్‌నగర్: మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నాయకుడు సాతాల గోపాల్ ఆదివానం ఓ ప్రకటనలో తెలిపారు. గాజులరామారం డివిజన్ మహాదేవపురం చౌరస్తాలో జయంతి కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ ఏపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, స్పోక్ పర్సన్ ఆరే శ్యామల ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఆలయానికి రూ.1.5 లక్షల విరాళం



ఆలయ సిబ్బందితో కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్: నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలోని చెర్ల ఎల్లమ్మ అమ్మవారి బోనాల నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి రూ.1.05లక్షలను ఆదివారం విరాళంగా అందజేశారు. బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ ఆస్కానీ మారుతీసాగర్, అధ్యక్షుడు ముక్కర్ల లాలయ్య, ప్రధాన కార్యదర్శి కొలెపాక వెంకట్, జాయింట్ సెక్రటరీలు కోట కృష్ణారావు, పితాని శ్రీనివాస్‌రావు కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి ఆలయ అభివృద్ధిపై చర్చించారు. ఈ మేరకు ఆయన విరాళం అందజేశారు. 20న జరిగే బోనాల పండుగను అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ సిబ్బంది సన్మానించారు.

సమ్మెను జయప్రదం చేయాలి

కూకట్‌పల్లి: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆదివారం కూకట్‌పల్లి భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా నాయకులు ఎం. శంకర్, రాములు, సుధాకర్ మాట్లాడుతూ.. మోడీ సర్కార్ కార్మిక హక్కులను కాలరాస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యాల కోసమే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చారని విమర్శించారు. 9న నిర్వహించే సమ్మెలో భాగస్వాములవ్వాలన్నారు.

బెగ్గర్ ఫ్రీ సిటీ.. కార్యాచరణేది?

- జంట సర్కిళ్ల అధికారుల నిర్లక్ష్యం
- ప్రధాన చౌరస్తాల వద్ద యాచకులు
- గుర్తించి షెల్టర్ హోమ్‌కు తరలించాల్సిన అధికారులు
- హిజ్రాలతో ఇబ్బందులు పడుతున్న జనం

నగరంలో బెగ్గర్ ఫ్రీ సిటీ కోసం చర్యలు చేపడుతుండగా కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఆ దిశగా అధికారులు కార్యాచరణ రూపొందించడం లేదు. పలు ప్రధాన కూడళ్ల వద్ద ఇబ్బంది కలిగిస్తూ వస్తున్న యాచకులను గుర్తించి షెల్టర్ హోమ్‌కు తరలించాల్సిన అవసరం ఉంది. కానీ జంట సర్కిళ్ల పరిధిలో ఉన్న అధికారులు మాత్రం గ్రేటర్ కమిషనర్ తీసుకున్న నిర్ణయాన్ని ఆచరణలో పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.



కుత్బుల్లాపూర్: షాపూర్ నగర్ ప్రధాన చౌరస్తాతో పాటు ఐడీపీఎల్, సూరారం చౌరస్తా, గండి మైసమ్మ చౌరస్తా, కొంపల్లి చౌరస్తా, చింతల్ ప్రధాన రహదారి, షాపూర్ నగర్ ఉషోదయ టవర్, సుచిత్ర జంక్షన్ల వద్ద నిత్యం యాచకులు కనిపిస్తున్నారు. కుటుంబంతో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని వెంటపడి మరి వారి వద్ద డబ్బులు వసూలు చేసే వరకు వదిలి పెట్టడం లేదని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కార్లు ఇతర వాహనాలు సైతం ఆపి మరి యాచిస్తూ ఇబ్బందులకు గురి చేస్తూ వస్తున్నారు. ఈ విషయంపై గ్రేటర్ అధికారులు వారిని గుర్తించి షెల్టర్ హోమ్‌కు తరలించే ప్రక్రియను అర్బన్ కమ్యూనిటీ విభాగానికి అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. జంట సర్కిళ్ల పరిధిలో ప్రధాన రహదారుల వెంట యాచిస్తూ కనిపిస్తున్న వారిని కట్టడి చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు అని చెప్పుకోవచ్చు. నగరంలో బెగ్గర్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు పలువురిని గుర్తించి షెల్టర్ హోమ్ కు తరలిస్తూ వారికి కౌన్సిలింగ్ ఇస్తూ ముందుకు సాగుతున్నారు. ఇక్కడ మాత్రం అవేమి తమ పరిధికి రాదన్నట్లుగా వ్యవహరించడం విశేషం. సుచిత్ర చౌరస్తాలో వీరి సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తుంది. ముఖ్యంగా ఇతర రాష్ట్రాలకు సంబంధించిన వారే అధికంగా ఉండటం విశేషం.

అడ్డుకట్టేది?

నియోజక వర్గ పరిధిలోని పలు ప్రధాన రహదారుల వెంట ఉన్న జంక్షన్ల వద్ద హిజ్రాల ఆగడాలు రోజురోజుకు శృతి మించుతున్నాయి. ప్రధాన జంక్షన్‌ల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా ఏరియాలను పంచుకొని మరి వస్తున్న ప్రక్రియ చేపట్టడం విశేషం. అంతేకాకుండా ఏదైనా దుకాణం, వ్యాపార సంస్థ ప్రారంభం అయితే వీరి హడావిడి అంతా ఇంతా కాదు. కుటుంబ సభ్యులతో పూజా కార్యక్రమాల్లో ఉండగానే అశ్లీలంగా వ్యవహరిస్తున్నారని పలువురు పేర్కొన్నారు. డిమాండ్ చేసి అడిగిన మొత్తాన్ని ఇచ్చి వెళ్లగొట్టడం పరిపాటిగా మారుతుంది. ఒకవైపు పోలీసులు వీరిపై ఫిర్యాదు చేయమని చెబుతున్నప్పటికీ ఎవరు ధైర్యం చేసి ఫిర్యాదు చేయకపోవడంతో వీరి ఆగడాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇటీవల వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో ఓ గృహప్రవేశం వద్ద చేసిన లొల్లితో కుటుంబ సభ్యులు కన్నీళ్ల పర్యంతమయ్యారు. అంతేకాకుండా సుచిత్ర ప్రధాన చౌరస్తా వద్ద ఇటీవల ఓ కార్యాలయం ప్రారంభం కాగా వేళల్లో డబ్బులు అడిగి హంగామా చేశారు. ఇదే క్రమంలో గంగా ఎన్‌క్లేవ్‌లో హోటల్ ప్రారంభోత్సవం సందర్భంగా వచ్చిన ప్రజాప్రతినిధి కూడా చేదు అనుభవం ఏర్పడింది. హోటల్ నిర్వాహకుల వద్ద డబ్బులు వసూలు చేసి వచ్చిన అతిథిని సైతం ఇబ్బంది పెట్టారు. ఈ విషయంపై పోలీసులు దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష పార్టీలు, అనుబంధ సంస్థల నాయకులు

కుత్బుల్లాపూర్: బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాలతో కార్మికులను కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా చేసేందుకు కేంద్రం కుట్ర పన్నిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్ అన్నారు. ఆదివారం వామపక్ష పార్టీలు, అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. జీడిమెట్ల పారిశ్రామికవాడ నుంచి షాపూర్‌నగర్ రైతు బజారు, ఉషోదయ టవర్స్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికలోకం ఏకమై కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసేలా ఒత్తిడి తేవాలన్నారు. దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని తమ గళాన్ని వినిపించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కుత్బుల్లాపూర్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, దేవదానం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ మండల నాయకులు స్వామి, నరసింహారెడ్డి, సుంకిరెడ్డి, నాయకులు ప్రవీణ్, ఈశ్వర్, సెంట్రింగ్ కార్మిక సంఘం నాయకుడు మధు, డీవైఎఫ్ఐ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి భాషా తదితరులు పాల్గొన్నారు

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారంజక పాలనను అందిస్తోందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం గాజులరామారంలోని చిత్తారమ్మదేవి ఆలయ ప్రాంగణంలో లబ్ధిదారులకు ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన స్వరూపకు రూ.1.40 లక్షలు, గొడుగు రాజుకు రూ.60వేలు, కృపరాజుకు రూ.60వేల చొప్పున ప్రభుత్వ ఆర్థిక సహాయంగా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం వరంలాంటిదని, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా లేబర్ సెల్ ప్రెసిడెంట్ కందాడి సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్, కొంపల్లి కాంగ్రెస్ నాయకుడు జెమ్మి దేవేందర్, కుత్బుల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ జయరామ్, మాజీ కౌన్సిలర్ రంగారావు, మోతే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు

నిజాంపేట్: నిజాంపేట్‌లోని సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి చందన అలంకారం, లక్ష తులసి అర్చన ఎంతో విశేషంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు బదరి నారాయణాచార్యులు, తిరుమల ఆగమ పండితుడు శేషసాయి, వెంకటరమణాచార్యులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డికి ఆశీర్వచనాలు అందజేశారు.



సూరారం వెంకట్రాంనగర్‌లోని వేంకటేశ్వర ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

దుండిగల్: మెరుగైన వసతులను కల్పించే దిశగా పని చేస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపల్ శంభీపూర్‌లోని కార్యాలయంలో ఆదివారం బహదూర్‌పల్లి గ్రీన్ హిల్స్ కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్సీని కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ పద్మారావు, నాయకులు వెంకటేష్ గౌడ్, జహంగీర్, కాలనీ ప్రెసిడెంట్ కస్తూరి అమర్‌నాథ్, జనరల్ సెక్రటరీ దామోదర్, ట్రెజరర్ నర్రా రాజు, వైస్ ప్రెసిడెంట్ రఘుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలి



చింతల్: సుచిత్ర సెంటర్ రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని చింతల్ ఈస్ట్ కాలనీ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంటయ్య ఆదివారం ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటు లింగంపల్లి స్టేషన్‌కు సుచిత్ర రైల్వేస్టేషన్ 20 కిలోమీటర్లు, ఇటు చర్లపల్లి రైల్వేస్టేషన్లకు 20 కిలోమీటర్ల దూరంలో ఉందని, ఈ స్టేషన్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాప్‌ను ఏర్పాటు చేస్తే కుత్బుల్లాపూర్, నిజాంపేట్, బాచుపల్లి, దుండిగల్, బాలానగర్, జగద్గిరిగుట్ట తదితర ప్రాంత వాసులకు చేరువలో ఉంటుందన్నారు. దీనిపై స్పందించిన ఎంపీ.. కేంద్ర రైల్వే శాఖామంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల్లో భాగస్వాములవ్వాలి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంత్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: ప్రతి ఒక్కరూ రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనుల్లో భాగస్వాములవ్వాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. జాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోని రోడ్డు నెం16వ వార్డు రాజీవ్ గాంధీ నగర్‌లో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్ ఆగం పాండు, ఎస్ఎంఎస్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్‌రెడ్డి, కొలన్ బాల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు నాని తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఆదివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ 23లోని ప్రగతినగర్ అధ్యక్షులు పోచంపల్లి రమేష్, నాగరాజు మిత్ర బృందం నియోజకవర్గం ఇన్‌చార్జి హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో శివప్రసాద్, సోహెల్, వంశీ, మధు, భార్గవ్, ఎస్.తేజ, శ్రీనివాస్, టి పరమేష్, శోభన్, అఖిల్, మహేష్, రాజు, గురువాహి, నవీన్, రాజేష్, సాయి, రాజేష్, రమేష్‌బాబు, సత్యనారాయణ, గాంధీ, మాధవి, సంపత్‌రెడ్డి, శ్రీనివాస్‌రాజు, నాని, నాయుడు, నాగేష్, సన్నీ యాదవ్, రాము, నిఖిల్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి



కుత్బుల్లాపూర్: జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. షాపూర్‌నగర్‌లోని ఉషోదయ టవర్స్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశం కోసం ఆయన చేసిన సేవలు ఎనలేనివని, నేటి యువత ఆయన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపతిరాజు, కంది శ్రీరాములు, నల్ల జైశంకర్ గౌడ్, పులి బలరాం, కత్తి భీమరాజు, బైండ్ల రాము, చిన్నస్వామి, సుభ్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లుగా ముందుకు సాగని బాక్స్ నాలా!

- నాలా పనులపై కోర్టును ఆశ్రయించిన పరిశ్రమ యాజమాన్యం
- కోర్టు స్టే.. ఆగిన పనులు
- అధికారుల వైఖరిపై కాలనీవాసుల ఆగ్రహం

అధికారుల ముందు చూపు కొరవడటంతో అభివృద్ధి పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. వరదనీరు సాఫీగా వెళ్లేందుకు చేపట్టిన బాక్స్ నాలా పనులు తమ స్థలం గుండా చేపట్టారని ఓ పరిశ్రమ యాజమాన్యం కోర్టును ఆశ్రయించడంతో మూడేళ్లుగా నిలిచిపోయాయి. కొంత మేర నాలా పూర్తి చేసిన కాంట్రాక్టర్ శ్లాబ్ పనులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం చెత్తాచెదారాలు, మట్టివ్యర్థాలతో నాలా పూడుకుపోయింది. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారింది.



అసంపూర్తిగా వదలేసిన బాక్స్ నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు

రంగారెడ్డినగర్ : వరదనీటితో పాటు మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు గిరినగర్‌లోని టెట్రా టూలింగ్ సిస్టమ్స్ నుంచి ఎంపీపీ స్కూల్ వరకు రూ.90 లక్షల నిధులతో బాక్స్ డ్రెయిన్ పనులకు 2003 జులైలో శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ గిరినగర్ పోచమ్మ ఆలయం నుంచి గిరినగర్ ప్రధాన రోడ్డు వరకు గోతులు తీసిన నాలా పనులను చేపట్టి కొంత మేర పూర్తి చేశాడు. సమీపంలోని పెట్రో టూలింగ్ సిస్టమ్స్ పరిశ్రమను ఆనుకుని చేపట్టిన నాలా పనులతో పరిశ్రమ యాజమాన్యం కోర్టును ఆశ్రయించింది. తమ స్థలం నుంచి నాలాను చేపడుతున్నారని ఆరోపిస్తూ కోర్టు నుండి స్టే తెచ్చుకుంది. దీంతో వరదనీటి నాలా పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి..

పూర్తైన పనులు వృథాగా..

వరదనీటి నాలా కోసం పోచమ్మ ఆలయం నుంచి గిరినగర్ ప్రధాన రోడ్డు వరకు గోతులు తీసి కాంట్రాక్టర్ కాంక్రీట్ పనులు పూర్తి చేశారు. అయితే శ్లాబ్ పనులు చేపట్టే క్రమంలో కోర్టు స్టే రావడంతో పనులు నిలిచిపోయాయి. మూడేళ్లుగా పనులు ముందుకు సాగకపోవడంతో ప్రస్తుతం పూర్తైన నాలాలో సమీపంలోని ఇళ్ల వాసులు కాంక్రీట్ వ్యర్థాలు, చెత్తను వేయడంతో పూర్తిగా పూడుకుపోయింది. దీంతో ఇప్పటి వరకు చేసిన పనులు వృథాగా మారాయని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు వరదనీటి డ్రెయిన్ నాలా నిర్మాణం చేపట్టే సమయంలోనే స్థల వివాదం తలెత్తకుండా సదరు పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి ఉంటే పనులు ఇప్పటికే పూర్తయ్యేవని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



టెట్రా టూలింగ్ సిస్టమ్స్ పరిశ్రమ గుండా వెళ్తున్న నాలా

వరదనీరు వెళ్లే దారి లేక వీధుల్లోనే వరద

వరదనీరు బయటకు వెళ్లే మార్గం మూసుకుపోవడంతో భారీ వర్షం పడ్డ ప్రతిసారి దిగువున ఉన్న తమ వీధుల్లో వర్షపునీరు చేరుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సదరు పరిశ్రమ యాజమాన్యాన్ని ఒప్పించి నాలా పనులు ముందుకు సాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కోర్టు స్టేతోనే పనులు నిలిచాయి

బాక్స్ నాలాపై పెట్రో టూలింగ్ సిస్టమ్స్ పరిశ్రమ యాజమాన్యం కోర్టును ఆశ్రయించింది. కోర్టు స్టేతో పనులు నిలిపివేయాయి. కోర్టు వివాదం ముగిసిన వెంటనే పనులు చేపడతాం.

-లక్ష్మీగణేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్.

కాలనీల అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్



ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న బూర్గుబావి హన్మంతరావు

కుత్బుల్లాపూర్: కాలనీల అభివృద్ధిలో యువత భాగస్వాములవ్వాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ మెట్‌కానిగూడ, కృష్ణ మహాలక్ష్మి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యలపైయ వినతిపత్రం అందజేశారు. పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అరుణ్ కుమార్, రఘుపతి రెడ్డి తదితరులు ఉన్నారు.

- జీడిమెట్ల గ్రామంలో వీర హనుమాన్ దేవాలయం ఆవరణలో నిర్వహించిన గాయత్రి హోమంలో ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నూతనంగా నిర్మించిన గోశాల షెడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో వీర హనుమాన్ గోశాల నిర్వాహకులు మోహన్, నరేష్ పాల్గొన్నారు.
- దూలపల్లిలో రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోతున్న వారికి అండగా ఉంటామని ఎమ్మెల్యే వివేకానంద భరోసా ఇచ్చారు. దూలపల్లి ప్రధాన రోడ్డు వెడల్పులో భాగంగా ఎలాంటి పారితోషికం ఇవ్వకుండా షాపులు కూల్చడానికి కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కేవలం వారం రోజుల వ్యవధి సమయం ఇవ్వడం సరికాదన్నారు. ఆదివారం దూలపల్లి మాజీ సర్పంచ్ బూరుగు బావి హనుమంతరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిశారు. పారితోషికం ప్రకటించకుండా అధికారులు రోడ్డు విస్తరణలో షాపులు తొలగిస్తామంటూ నోటీసులు ఇవ్వడంపై వివేకానంద దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన.. కొంపల్లి కమిషనర్ కృష్ణారెడ్డితో మాట్లాడి షాపులను తొలగించేందుకు కొంత సమయం ఇవ్వాలని ఆదేశించారు.
- దుండిగల్ మున్సిపల్ గ్రీన్ హిల్స్ హౌసింగ్ కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గ కమిటీ సభ్యులు మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిశారు. తమ కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు కస్తూరి అమర్‌నాథ్, ప్రధాన కార్యదర్శి దామోదర్, కోశాధికారి నర్ర రాజ్, ఉపాధ్యక్షుడు రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.